క్లుప్తంగా

నగరంలో శాకాహార ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పలు వీధుల్లో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ధ్యానులు, శాకాహారులు, సంస్థ ప్రతినిధులు ఐటీఐ సర్కిల్ నుంచి సమీపంలోని వీధుల్లో ఈ ర్యాలీ చేపట్టారు. శాకాహారం శ్రేష్టమైనదని, అమృతాహారమని నినాదాలు చేశారు. ప్లకార్డులు, బ్యానర్లు చేతబూని, ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ర్యాలీలో పిరమిడ్ సొసైటీ అధ్యక్షులు జీవీఎస్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ ఊర్మిళాదేవి, సీనియర్ మాస్టర్లు రమణ, ఓబయ్య, మురళి, సంజీవి, బాలాజీ, శర్వాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆట-పాట అదుర్స్



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపులో భాగంగా స్థానిక పాఠశాల చిన్నారుల ఆట-పాట అదుర్స్ అన్న రీతిలో సాగాయి. కమలాపురానికి చెందిన కిశోర్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు హుషారుగా ఆడిపాడి సందర్శకులను ఆకట్టుకున్నారు. సందర్శకులు పదే పదే తమ కరతాళ ధ్వనులతో చిన్నారులను ప్రోత్సహించారు. శిల్పారామం ఏఓ శివప్రసాద్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ సందర్శన



ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ కంపెనీలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన అప్పారెల్ టెక్నాలజీ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా ఆదివారం పులివెందుల ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ లిమిటెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగరాజు పంట నుంచి వచ్చే పత్తి ద్వారా దారం తయారీ గురించి వివరించారు. సంబంధిత దారాన్ని గార్మెంట్ ఇండస్ట్రీస్‌కు సరఫరా చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ మహమ్మద్ షరీఫ్, మహమ్మద్ సికిందర్ హుస్సేన్, సంస్థ సిబ్బంది దిలీప్, కిషోర్, ఖైరున్నీషాభాను, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మహబూబ్ అలీ

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్‌అలీ పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మూడు వేల విలువ గల రక్త పరీక్షలతోపాటు గుండెకు సంబంధించిన పరీక్షలను నిర్వహించారు. శిబిరంలో ల్యాబ్ మేనేజర్ సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది సయ్యద్‌నూర్, షాహిద్‌ఫఠాన్, ఆయేషా, గౌతమి, బార్గవి, శిరీషరెడ్డి, వైష్ణవి, సువర్ణలతోపాటు మెడికల్ రెప్స్ పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

దేశాన్ని ఏకతాటిపైకి తెచ్చింది రాజ్యాంగమే

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

కడప కార్పొరేషన్ : దేశాన్ని ఏకతాటిపై నడిపిస్తోంది రాజ్యాంగమేనని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి వారు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ భిన్న మతాలు, కులాలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న మన దేశం కలిసికట్టుగా ఉందంటే అది రాజ్యాంగం గొప్పదనమేనన్నారు. ప్రపంచంలోనే అతిపెద్దైన మన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ ఆమోదించగా, 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిందన్నారు. అందరికీ సమానంగా జీవించే హక్కు, దోపిడీకి వ్యతిరేకంగా రక్షణ, ఇష్టమొచ్చిన మతాన్ని అనుసరించే హక్కు, అల్ప సంఖ్యాక వర్గాలకు రక్షణ, హక్కులను పొందడానికి న్యాయస్థానాలకు వెళ్లే హక్కులు కల్పించబడ్డాయన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలించి ప్రజల మన్ననలు పొందారని, ప్రస్తుతం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించి సామాజిక న్యాయం చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ భారత దేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదని, దానిని రచించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావిగా కీర్తించబడుతున్నారన్నారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పార్టీ నాయకులు బీహెచ్ ఇలియాస్, బంగారు నాగయ్య, తోటక్రిష్ణ, వేణుగోపాల్ నాయక్, ఆర్‌వీ రమణ, కె.బాబు, మేసాప్రసాద్, చైతన్య, చెన్నయ్య, బండి ప్రసాద్, త్యాగరాజు, షఫీ, శ్యాంసన్, లక్ష్మినారాయణ, మహిళా నేతలు సంధ్యారాణి, టీపీ వెంకట సుబ్బమ్మ, బండి మరియలు, రామలక్షుమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ యావత్ ప్రపంచానికి ఆదర్శప్రాయుడని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజద్ బాషా పేర్కొన్నారు. స్థానిక మాసాపేట కూడలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సంపత్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇలియాస్, బంగారు నాగయ్య యాదవ్, షఫీ, త్యాగరాజు, బాలస్వామి రెడ్డి, ఎస్. సుబ్బారెడ్డి, చెన్నయ్య, సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

■ నూతన కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి డీహెచ్‌పీఎస్ కార్యదర్శి కె.మునెయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దస్తగిరి, సంజయ్ పాల్గొన్నారు.

■ స్థానిక స్థానిక అంబేడ్కర్ నగర్‌లో ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమల వేసి నివాళులు అర్పించారు. ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రామాంజనేయులు, నాయకులు వీరయ్య, సరిత, ప్రవంతి పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో..

వైవీయూ : కడప నగరంలోని పలు విద్యాసంస్థల్లో 74వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ పూలమాల వేసి నివాళులర్పించారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి విద్యార్థుల చేత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం. రమేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీర్లు అంకాల నాగరాజు, శివ రామకృష్ణ, వై.సావిత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.



కడప కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

స్టెప్ ఆధ్వర్యంలో..

కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో స్టెప్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ పి.శంకర్, స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి రాజ్యాంగ దినోత్సవ గొప్పదనాన్ని వివరించారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగ దినోత్సవంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి, అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో..

నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య రాజ్యాంగ దినోత్సవం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయంలో..

కడప కల్చరల్ : కడప ఎల్ఐసీ కేంద్ర కార్యాలయం నుంచి దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా ఎల్ఐసీ సిబ్బంది చేత సంస్థ చైర్ పర్సన్ సిద్ధార్థ మహంతి రాజ్యాంగ పీఠిక చదివించారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న తర్వాత కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ గిరిధర్ మాట్లాడారు. కార్యాక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో..

కడప ఎడ్యుకేషన్ : కడప వక్కలపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రైమరీ స్కూల్‌లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. హెడ్ టీచర్, ఎస్టీయూ జిల్లా మైనార్టీ కన్వీనర్ షేక్ నజీబుల్లా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంక్‌లో..

కడప అగ్రికల్చర్ : కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీ)లో డీసీసీ బ్యాంకు సిబ్బంది, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సిబ్బంది కలిసి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ రిజిస్ట్రారు గుర్రప్ప, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాలమహానాడు కార్యాలయంలో..

కడప కోటిరెడ్డిసర్కిల్ : మాలమహానాడు కార్యాలయంలో నగర అధ్యక్షులు డేవిడ్ సత్తిరాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీ మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు ఇల్లూరి సురేష్, న్యాయవాది ఓబులేశు, జిల్లా కార్యదర్శి పాలెం సంజీవయ్య, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు శిరీష, నగర కార్యదర్శి కుమార్, మైనార్టీ విభాగం నగర అధ్యక్షులు మస్తాన్, ఆనంద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత

భారత రాజ్యాంగ పరిరక్షణ మనందరి బాధ్యత అని కడప ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిబ్బంది చేత ఆర్డీఓ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఓ వెంకటస్వామి, కేఆర్ ఆర్‌సీ తహసీల్దార్ శేషారాంసింగ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పి.రఘురామయ్య, కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో..

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లోని ఓపీలోని పరిపాలన విభాగంలో భారత రాజ్యాంగ దినోత్సవంను నిర్వహించారు. రాజ్యాంగంను రూపొందించిన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ విభాగం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

■ కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ ఆదేశాల మేరకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస నాయక్ ఆధ్వర్యంలో వైద్య అధ్యాపకులు, సిబ్బంది, వైద్య విద్యార్థులతో కలిసి బి.ఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు దాసరి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



కడప కోటిరెడ్డిసర్కిల్ : సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ మధుసూదన్



వైవీయూ: ఆర్ట్స్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు




కడప అగ్రికల్చర్ : డీసీసీ బ్యాంక్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప



కడప అర్బన్ : ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

శరణమయ్యా.. శబరిగిరీశా..!



పడిమెట్లపై అయ్యప్పస్వామి



పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీ అయ్యప్పస్వామి పడిపూజను వైభవంగా నిర్వహించారు. అందరూ భేషజాలను దూరం పెట్టి గొంతెత్తి మైమరిచి అయ్యప్పను స్తుతిస్తూ భక్తిగీతాలను ఆలపించారు. తన్మయత్వంతో ఊగిపోయారు. శరణమంటిమయా.. శబరిగిరీశా అంటూ భక్తిపారవశ్యంతో నినాదాలు చేశారు. ఆలయ ధర్మకర్త వెంకటరెడ్డి బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాన్ని పూర్తిగా కనుల పండువగా అలంకరించారు. వేదిక మధ్యలో 18 మెట్లపై అభయముద్రలో ఉన్న అయ్యప్పస్వామిని, ఇరువైపులా శ్రీలక్ష్మిమాత, శ్రీగణపతిలను కొలువుదీర్చారు. 18 మెట్లపై దీపాలను, ఫలపుష్పాలను అలంకరించారు. ఆలయ అర్చకులు దామోదరశర్మ ఆధ్వర్యంలో పూజాధికాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలకు హాజరైన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. దాదాపు రెండున్నర గంటలపాటు అయ్యప్పను కీర్తిస్తూ గీతాలను ఆలపించారు. అనంతరం భజన గీతాలను ఆలపిస్తుండగా భక్తులంతా పారవశ్యంతో మణికంఠునిపై మనసు నిలిపి తాము భజనలు చేశారు. హైదరాబాదుకు చెందిన అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి అధ్యక్షులు రాజు దేశ్‌పాండే, ఒంగోలుకు చెందిన లక్ష్మారెడ్డి బృందాలచే ఉత్సాహ భరితంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. పూజలనంతరం భక్తులందరికీ నిర్వాహకులు భిక్షను ఏర్పాటు చేశారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామంలో శనివారం రాత్రి అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కన్య స్వాములు కలశాలతో, మహిళలు కార్తీక దీపాలతో అయ్యప్ప స్వామి ఉత్సవ మూర్తిని మాచుపల్లి గ్రామంలోని రేణుకా యల్లమాంబ ఆలయం నుంచి గ్రామ పురవీదుల్లో ఊరేగించారు. గ్రామోత్సవంలో దారి పొడవునా భక్తులు నీరు దారపోస్తూ కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

తనిఖీల పేరుతో వేధించడం తగదు



మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను వేధించడం తగదని విద్యాశాఖ అధికారులకు ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం కడపలోని ఎస్‌టీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఇటీవల వివిధ జిల్లాలోని పాఠశాలలను సందర్శిస్తూ సిలబస్ పూర్తి కాలేదని, వర్కుబుక్స్ సరిగా రుద్దలేదని ఆ జిల్లా విద్యాశాఖ అధికారులపైన ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు ఇవ్వాలని ఆదేశిస్తున్నారన్నారు. ఫలితంగా జిల్లాలో డీఈఓ ఆదేశాలతో వివిధ మండలాల్లో ఎంఈఓలు తనిఖీల పేరుతో లోపాలు కనిపిస్తే ఎందుకు చేయలేదని నోటీసులు ఇస్తూ ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులను వేధిచే అధికారులను కట్టడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్ర, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రాజగోపాల్‌రెడ్డి, శ్రీరాములు, రవిశంకర్, మదన్‌రెడ్డి తోపాటు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ ప్రమోదరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్ వైద్యురాలు, లాప్రోస్కోపీ సర్జన్ డాక్టర్ వై.ప్రమోదరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం ఆర్టీసీ బస్టాండు వద్దగల మాతృశ్రీ ఐవీఎఫ్ క్లినిక్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తమ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో ప్రతి మంగళవారం ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమకు చెందిన ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రపంచ స్థాయి నాణ్యత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. తమ వద్ద వైద్య సేవలు పొందిన వారికి ఎందరికో సంతానం ప్రాప్తిని కల్పించామని తెలిపారు. కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు సైతం చేరువ చేసేందుకు వీలుగా ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ కన్సల్టేషన్ ఉచితమని, దంపతులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తామన్నారు. అలాగే మహిళలకు బేస్ లైన్ స్కానింగ్, పురుషులకు సెమెన్ అనాలసిస్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. శిబిరానికి రాదలచినవారు 7995629110 అనే సెల్ నంబర్ సంప్రదించాలని డాక్టర్ కోరారు.

వైభవంగా జ్వాలా తోరణం



పూజల్లో పాల్గొన్న జడ్జి రామారావు దంపతులు



జ్వాలా తోరణాలు వెలిగిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కార్తీక మాసంలో అత్యంత పుణ్యదాయకంగా భావించే పౌర్ణమి సందర్భంగా ఆదివారం నగరంలోని శివాలయాలలో జ్వాలా తోరణాలు వెలిగించారు. శివయ్యకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం ఆకాశదీపం వెలిగించిన అనంతరం భక్తులు విశేష అలంకారంలో ఉన్న స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన ద్వారాల వద్ద జ్వాల తోరణాలను ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు జ్వాలా తోరణాలను వెలిగించి హర హర మహాదేవ నినాదాలు చేస్తున్న భక్తులతో కలిసి తోరణాలకు నమస్కరించుకున్నారు. కడప నగరం దేవునికడప శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో న్యాయమూర్తి రామారావు దంపతులు సంప్రదాయ దుస్తుల్లో జ్వాలా తోరణాన్ని వెలిగించి మొక్కుకున్నారు.

ఘనంగా వరకట్న వ్యతిరేక దినోత్సవం



మాట్లాడుతున్న డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రాజ్యాంగ, వరకట్న వ్యతిరేక దినోత్సవాల తోపాటు న్యాయ విజ్ఞాన సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత మాట్లాడుతూ నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16 ఫోక్సో యాక్ట్, జువెనైల్ జస్టిస్ యాక్ట్, మహిళల చట్టాలు, విక్టిమ్ కాంపెన్సేషన్ పండ్‌మెంటల్ రైట్స్ పండ్‌మెంటల్ డ్యూటీస్‌తోపాటు వరకట్న వ్యతిరేక దినోత్సవ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. వరకట్న వ్యతిరేక చట్టం 1961 గురించి కూడా వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి, ఫిజికల్ డైరెక్టర్ నాగమ్మ, ఫార్మసీ హెడ్ సుజాత, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పెద్దకొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం ప్రారంభోత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ వారు ఆదివారం రసవత్తరంగా బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి బహుమతి మైదుకూరుకు చెందని కుర్ర వెంకటేష్ యాదవ్, రెండవ బహుమతి బాలయ్యగారిపల్లెకు చెందిన ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి, మూడవ బహుమతి వసంతపేటకు చెందిన ద్వార్షల చంద్రశేఖర్ రెడ్డి, నాలుగవ బహుమతి గోసులవారిపల్లెకు చెందిన పాపిరెడ్డి ప్రతాప్ రెడ్డి, ఐదవ బహుమతి పొత్తురెడ్డిపల్లెకు చెందిన మొలే ప్రసాద్ రెడ్డిలకు సంబంధించిన ఎద్దు గెలుచుకున్నాయి.

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కమలాపురం : స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి లో ఖాళీగా ఉన్న 3 ఆయా పోస్టుల భర్తీకి దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ వసంతాబాయి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విభరాపురం-(ఓసీ), వల్లూరు మండలం చిన్నపుత్త (బీసీ-సీ), కొప్పోలు మెయిన్ (బీసీ-ఎ) అభ్యర్థులకు రోస్టరు ప్రకారం కేటాయించామన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై, 2023 జూలై 1 నాటికి 21 సం. పూర్తి అయి, 35 ఏళ్ల లోపు ఉన్న వారు అర్హులని ఆమె తెలిపారు. టెన్త్ క్లాస్ ఉత్తీర్ణులైన వారు లేని పక్షంలో అంతకన్న తక్కువ విద్యార్హత ఉన్న వారిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తు ప్రాజెక్ట్ కార్యాలయంలో అందజేయాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.